సుబ్బారావు, సుబ్బలక్ష్మిలది అన్యోన్యమైన దాంపత్యం. అరమరికలులేని జీవితం. ఆలుమగలు అంటే అచ్చం అలాగే ఉండాలనిపించుకునే సంసారం.

వారి అన్యోన్యమైన దాంపత్యానికి గుర్తింపుగా పెళ్ళైన ఏడాదిన్నరకే సుబ్బలక్ష్మి కడుపు పండింది. సుబ్బారావు సుబ్బలక్ష్మిల మనస్సులు ఆనందంతో పొంగిపోయాయి.

నవమాసాలు నిండుతున్నాయి. సుబ్బారావుది సిటీలో గుమాస్తాగిరి. సుబ్బారావు అత్తోరిది మారుమూల పల్లెటూరు. వైద్య సదుపాయాలు అస్సలులేని చిన్న ఊరు. అందుకే సుబ్బారావు, సుబ్బలక్ష్మికి పురుడు తనున్న సిటీలోనే పొయ్యాలని అత్త, మామల్ని ఒప్పించాడు.

నవమాసాలు నిండుతున్నాయి కదా, సుబ్బలక్ష్మికి పురుడుపోద్దామని, సుబ్బారావు అత్తగారు, చిన్న (మరదల్ని) కూతుర్ని వెంటబెట్టుకుని ఒక శుభముహూర్తాన సుబ్బారావు ఇల్లు చేరుకుంది.

ఎప్పుడా, ఎప్పుడా అని ఎదురుచూస్తున్నంతలోనే మొన్నటిరోజున సుబ్బలక్ష్మి సుబ్బాయమ్మ హాస్పిటల్లో మగబిడ్డని ప్రసవించింది.



# [illegible]

— కృష్ణదాసరి

హాస్పిటల్లో సుబ్బలక్ష్మి దగ్గిర రాత్రుళ్ళు చెల్లెలు సుభద్రని తోడుగా ఉంచి అత్తగారు ఇంటిదగ్గిరనే ఉంటుంది. బహూశా వయస్సులో ఉన్న పిల్లకదా సుబ్బారావుగమక తొందరపడిపోతే తనింకో పురుడు పొయ్యాలనే భయంతో కాబోలు.

నిజం చెప్పాలంటే సుబ్బారావు అటువంటి వాడు కాదనుకోండి. 'కాని ఏం చెబుతాం' మగాడు కదా అవకాశమొస్తే వదలక పోవచ్చు. ఆ భయంచేతే ముందు జాపుతో సుబ్బలక్ష్మి దగ్గిరికి పంపేస్తుంది సుభద్రని. ఆ రోజు సుబ్బారావు డ్యూటీకి వెళుతూ వీధి గుమ్మం దగ్గరకు వెళ్ళి వెనక్కి తిరిగి అత్తగార్ని చూసి కన్నుకొట్టాడు. రెండడుగులు ముందుకి వెళ్ళిన తరువాత తెలిసింది పాపం సుబ్బారావుకి తనిప్పుడు కన్నుకొట్టింది తన భార్యకి కాదని, తన అత్తకని! అంతే ఒక్కసారిగా సుబ్బారావుకి వళ్ళంతా జల్లుమంది. నరాలు బిర్రబిగుసుకున్నాయి. "అయ్యబాబోయ్, అలవాటులో పొరపాటు జరిగి పోయింది" అనుకుని వెనక్కి చూడకుండా గబగబా నడుచుకుని డ్యూటీకి వెళ్ళిపోయాడు.

ఒక్క విషయం చెప్పడం మరిచాను. సుబ్బారావు సుబ్బలక్ష్మిల సంసారంలో రోజూ జరిగే ఒక విషయం ఏమిటంటే, డ్యూటీకి వెళ్ళేటప్పుడుగాని, ఎక్కడికైనా బైటికి వెళ్ళేటప్పుడుగాని సుబ్బలక్ష్మిని గట్టిగా ముద్దు పెట్టుకోవడం, తన వెనకే వీధిగుమ్మందాకా వచ్చిన భార్యను చూసి కన్నుకొట్టడం సుబ్బారావుకి అలవాటు. ఇంకానయం ఇప్పుడు అత్తని పట్టుకుని భార్యనుకొని ముద్దు పెట్టలేదు. పొరపాటున కన్ను కొట్టాడంతే!

జరిగిన దానికి చాలా బాధపడి పోయాడు సుబ్బారావు. ఆఫీసులో కూర్చున్నాడు కాని సుబ్బారావుకి ఏం పని చేయబుద్ధి కావడం లేదు. "సాయంకాలం అత్తగారికి ముఖం ఎలా చూపించడం! ఈ విషయం సుబ్బలక్ష్మితో చెబితే ఇంకేమన్నా ఉందా. సుబ్బలక్ష్మి ఇల్లు పీకి పందిరేసెయ్యదూ. అన్న భయంతో కూడిన ఆలోచనంతో సతమతమై పోతున్నాడు.

మొత్తానికి డ్యూటీ టైం అయిపోయింది. ఉసూరుమంటూ బిక్కుబిక్కుమంటూ ఇంటికి చేరుకున్నాడు. వీధిగుమ్మం తలుపులు దగ్గరకి జారేసి వున్నాయి. భయపడుతూ, భయపడుతూ తలుపులు తోసుకుని అడుగు లోపలికి వేశాడు. ఇంట్లో ఎవరూ అలికిడి లేదు. గబగబా ఇంట్లో బాత్‌రూం వైపు నడిచాడు. బాత్‌రూంలో ఎవరో స్నానం చేస్తున్నారు. ఎవరో కాదు సుభద్ర అయ్యుంటుంది బాత్‌రూం తలుపు మీద ఉన్న షేప్‌బ్రా, షేప్‌జాకెట్, జపాన్ నైలెక్స్ శారీని చూసి 'అమ్మయ్య' అనుకున్నాడు సుబ్బారావు.

అత్తయ్య హాస్పిటల్‌కి వెళ్ళి ఉంటుంది. ప్రస్తుతానికి ఫర్వాలేదనుకొని తనపోయి తన రూంలో కూర్చుని పేపరు చదువుకోసాగాడు.

సుమారు అరగంట తరువాత బాత్‌రూంలో స్నానం ముగించుకొని మరో అరగంట కిచెన్ రూంలో నసిగి, కాఫీకప్పు పట్టుకొని అతి వయ్యారంగా నడిచొస్తున్న యాభై ఏళ్ళ అత్తగార్ని చూసి నిశ్చేష్టుడై పోయాడు సుబ్బారావు.

లూజు రవిక, నేత చీరలు కట్టుకునే యాభైయేళ్ళ అత్తగారు ఒక్కసారి ఈ విధంగా షేప్‌బ్రా, షేప్ జాకెట్‌తో, జపాన్ నైలెక్స్ చీరలో, లూజుజడలో మల్లెపూలతో అతి వయ్యారంగా నడుచు కొచ్చి సుబ్బారావు ముందు కాఫీ కప్పు పెట్టి ముసిముసిగా నవ్వుతూ పెళ్ళికాని పిల్లలా సిగ్గు పడిపోతూ లోపలికి వెళ్ళిపోతుంటే "తప్పైపోయిందత్తో" అంటూ తల పట్టుకుని కుర్చీలో కూలబడి పోయాడు పాపం సుబ్బారావు.